క్లుప్తంగా

నేడు వేల్పూరుకు ఎంపీ, ఎమ్మెల్యే రాక

శావల్యాపురం: నేడు మండలంలోని వేల్పూరు గ్రామంలో పలు అభివృద్ధి పనులతో భూమి పూజ కార్యక్రమాలకు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు ఉదయం 10 గంటలకు హాజరవుతున్నట్లు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య శుక్రవారం తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు, మండల పరిషత్ గ్రాంటు రూ. 5 లక్షల వ్యయంతో చేపట్టిన ప్రయాణికులు విశ్రాంతి భవనం, జలజీవన్ మిషన్ పథకంలో రూ. కోటి 80 లక్షల వ్యయంతో చేపడుతున్న మంచినీటి నిర్మాణ పనులకు భూమి పూజ కార్యక్రమాలకు హాజరు అవుతున్నారన్నారు.

వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలి

బొల్లాపల్లి: వినాయక చవితి పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని బండ్లమోటు ఎస్‌ఐ జి. రవికృష్ణ పలు సూచనలు చేశారు. విగ్రహాలు, మండపాల ఏర్పాటులో తగు జాగ్రత్తలు పాటించాలని, పోలీస్ నియమనిబంధనల ప్రకారం పండుగను నిర్వహించాలన్నారు. విద్యుత్ ప్రమాదాలకు తావులేకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలని, చుట్టు పక్కల వారికి శబ్ద కాలుష్యం లేకుండా చూసుకోవాలన్నారు. విగ్రహ కమిటీ ఏర్పాటు చేసి కమిటీ వివరాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో తెలపాలన్నారు. ఏమైన అవాంఛనీయ సంఘటనలు తలెత్తితే కమిటీ బాధ్యత వహించాల్సి ఉంటుందని ఎస్‌ఐ తెలిపారు. నిమజ్జన వివరాలను నియమ నిబంధనల ప్రకారం చేయాలని సూచించారు.

నేడు చిరుమామిళ్ళలో స్కూల్ గేమ్స్

నాదెండ్ల: చిరుమామిళ్ళ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు శనివారం ప్రారంభమౌతాయని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల ఇన్‌చార్జి కె.వెంకటనాగరాజు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, ఏపీ మోడల్‌పాఠశాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఖోఖో, అథ్లెటిక్స్, వాలీబాల్, టెన్నికాయిట్, కబడ్డీ పోటీలు 14,17 సంవత్సరాల లోపు బాలబాలికలకు విడివిడిగా జరుగుతాయన్నారు. ఈ పోటీల అనంతరం నియోజకవర్గ స్థాయి పోటీలు జరుగుతాయన్నారు.

అవగాహన సదస్సులు

శావల్యాపురం: మండలంలోని శానంపూడి, ముండ్రువారిపాలెం గ్రామపంచాయతీలో అంగన్‌వాడీ సెంటర్లలో పోషకాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజరు కప్పం శ్రీలత శుక్రవారం తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచులు పాపసాని విజయలక్ష్మి, మొనపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వన్‌టౌన్ ఎస్‌ఐగా రహంతుల్లా

నరసరావుపేట టౌన్: పల్నాడు జిల్లాలో ఇద్దరు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ వై. రవిశంకర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. టూటౌన్ ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న షేక్ రహంతుల్లాను వన్‌టౌన్ ఎస్‌గా బదిలీ చేశారు. అదే విధంగా డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచ్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న కె.సతీష్‌ను టూటౌన్ ఎస్‌ఐగా పోస్టింగ్ ఇచ్చారు.

పాఠశాలకు వస్తువుల బహూకరణ

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆ పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ తవనం రామిరెడ్డి రూ.13 వేల రూపాయల విలువ చేసే ఫ్యాన్, బెల్ క్లాక్‌ను శుక్రవారం హెచ్‌ఎం బియం సుభానీకి అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తహసీల్దార్ అంకారావు మాట్లాడుతూ స్కూల్ అభివృద్ధికి ఉపయోగపడే వస్తువులను బహుకరించిన తవనం రామిరెడ్డిని అభినందించారు. పాఠశాల అభివృద్ధికి, విద్యాభివృద్ధికి ప్రభుత్వం అవసరమైనన్ని నిధులు మంజూరు చేస్తుందన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సౌకర్యాలు, విద్యా బోధన చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో సుబ్బారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు వై. సైదయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చవితికి సిద్ధమవుతున్న గ్రామాలు



నాదెండ్ల: గ్రామాల్లో వినాయక చవితి వేడుకల సందర్భంగా సంబరాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 18న వినాయక చవితిని పురస్కరించుకుని గ్రామాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా సాతులూరులోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు గుంటూరు నుండి ప్రత్యేకంగా భారీ వినాయకుని విగ్రహాన్ని తెప్పించారు. విగ్రహానికి ముందుగా యువత బాణాసంచా, వాయిద్యాలతో ఆలయం వద్దకు తీసుకువచ్చారు. 18 నుంచి ఐదు రోజుల పాటూ వేడుకలు జరుగుతాయని, అనంతరం నిమజ్జన కార్యక్రమం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

సమాజాభివృద్ధిలో ఇంజినీర్ల భాగస్వామ్యం అవసరం

- పంచాయతీ రాజ్‌శాఖ డెప్యూటీ ఇంజినీర్ కె.హరనాథ్
- ఇంజినీర్స్ డేని ఘనంగా నిర్వహించిన పట్టణ లైసెన్స్‌డ్ ఇంజినీర్లు
- మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి నివాళి



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈ హరనాథ్, సంక్షేమ సంఘ ఇంజినీర్లు

నరసరావుపేట: ఇంజినీర్స్ పితామహుడు సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధి కోసం నిరంతరం కష్టపడి పని చేయాలని పంచాయతీ రాజ్‌శాఖ డెప్యూటీ ఇంజినీర్ కె.హరనాథ్ అన్నారు. శుక్రవారం పట్టణ లైసెన్స్‌డ్ ఇంజినీర్స్–సర్వేయర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విశ్వేశ్వరయ్య 56వ జన్మదినోత్సవం సందర్భంగా 162వ ఇంజినీర్స్ డేని ఘనంగా నిర్వహించారు. తొలుత మున్సిపల్ కార్యాలయ ఆవరణలోని విశ్వేశ్వరయ్య విగ్రహానికి ఇంజినీర్స్ సంఘం తరపున పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) భవనంలో ఇంజినీర్స్ డే వేడుకలు నిర్వహించారు. సభలో ప్రసంగించిన ప్రతి ఒక్కరు విశ్వేశ్వరయ్య గొప్పతనాన్ని, సేవా గుణాన్ని గొప్పగా స్మరించుకున్నారు. రాష్ట్ర ఇంజినీర్స్ సంక్షేమ సంఘ కార్యనిర్వాహక కార్యదర్శి కొమ్మసాని కమలాకర రెడ్డి, పట్టణ ప్రణాళికా విభాగపు అధికారి ఎంవీ.నరసింహారావు, పట్టణ ప్రణాళికా విభాగపు సూపర్‌వైజర్ కేవీ సత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారిని ఇంజినీర్లు ఘనంగా సన్మానించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా ముఖ్య కార్యదర్శి ఆర్.సతీష్‌కుమార్, ఉపాధ్యక్షులు బి.వెంకటనారాయణ, నరసరావుపేట పట్టణ ఇంజినీర్స్ సంఘ ముఖ్య కార్యదర్శి బి. శ్రీనివాస సింగ్, కోశాధికారి జి.అనిల్, గౌరవ అధ్యక్షులు జీపీ రంగయ్య, గౌరవ సలహాదారులు ఆర్.బ్రహ్మయ్య, జిందాల్ పాంథర్ స్టీల్ ప్రతినిధి పి.కిషోర్ ఈసీ సభ్యులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

వినుకొండలో...

వినుకొండ(నూజెండ్ల): స్థానిక గృహనిర్మాణ సంస్థ ఉప కార్యనిర్వాహక ఇంజినీరు కార్యాలయం నందు సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య (సర్ ఎంవి) జయంతి సందర్భంగా ఇంజినీర్స్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ నరసరావుపేట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.శివలింగం ముఖ్యఅతిథిగా పాల్గొని సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్ ఇంజినీర్‌గా సర్ ఎంవీ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వినుకొండ హౌసింగ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.శ్రీనివాస్, ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా ఆర్‌అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ కార్యాలయాల్లో ఇంజినీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు.



డాక్టర్ శ్రీనివాస్ దాకేటిని సత్కరిస్తున్న కళాశాల కార్యదర్శి అట్లూరిశాంతి

నరసరావుపేటలో...

నరసరావుపేట రూరల్: ఏఎం రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఇంజినీర్స్ డే వేడుకలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస్ దాకేటి, కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. కళాశాల ఆవరణలోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ముఖ్యఅతిథి డాక్టర్ శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గణేష్ ప్రసాద రెడ్డి, డిప్లొమా కళాశాల ప్రిన్సిపల్ కె.కృష్ణారెడ్డి, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



వినుకొండలో సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలి

నరసరావుపేట రూరల్: విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో జీవితంలో ముందుకు సాగాలని మండల విద్యాశాఖాధికారి ఎస్. నాగేశ్వరరావు తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14,17 మండల స్థాయి ఎంపిక పోటీలు శుక్రవారం లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించారు. పోటీలను మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు ప్రారంభించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 400మంది విద్యార్థులు పోటీలలో పాల్గొన్నారు. వీరికి ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, బాల్‌బాడ్మింటన్, యోగా, టెన్నికాయిట్ పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. అండర్–17 ఖోఖో బాలుర, బాలికల విభాగంలో శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ జట్టు ప్రథమ, సిందూ పాఠశాల ద్వితీయ స్థానం, అండర్–17 బాలుర కబడ్డీ పోటీలో కోటప్పకొండ జెడ్పీ హైస్కూల్ ప్రథమస్థానం, శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ ద్వితీయస్థానం, అండర్–17 వాలీబాల్ విభాగంలో ఉప్పలపాడు జెడ్పీ హైస్కూల్ ప్రథమ, జొన్నలగడ్డ హైస్కూల్ ద్వితీయ, బాలికల విభాగంలో ఎస్‌బీఆర్ మున్సిపల్ హైస్కూల్ ప్రథమస్థానం, అండర్–17 బాల్‌బాడ్మింటన్, టెన్నికాయిట్ బాల, బాలికల విభాగంలో శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ ప్రథమ, అండర్–17 బాలికల విభాగం కబడ్డీ పోటీలో కాకాని హైస్కూల్ ప్రథమస్థానంలో నిలిచాయి. పోటీలను పాఠశాల ప్రధానోపాధ్యాయినీ, మండల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కోఆర్డినేటర్ ఝాన్సీరాణి పర్యవేక్షించారు. పోటీలలో వ్యాయామ ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, చినరామయ్య, ఇస్రాయేలు, భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న మండల విద్యా శాఖాధికారి నాగేశ్వరరావు

పేటీయం మిషన్లు ద్వారా స్త్రీనిధి రుణాల చెల్లింపులు

జిల్లా స్త్రీనిధి ఏజీయం రంతు చినబుల్లెయ్య

శావల్యాపురం: ఇక నుంచి స్త్రీనిధి రుణాలు చెల్లింపులు పేటీయం మిషన్లు ద్వారా జరగాలని జిల్లా స్త్రీనిధి ఏజీయం రంతు చినబుల్లెయ్య అన్నారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథకం కార్యాలయంలో స్త్రీనిధి రుణాలు రీకవరీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఏజీయం మాట్లాడుతూ నియోజకవర్గంలో స్త్రీనిధి రుణాలు రూ. 26 కోట్లు 5600 మంది మహిళా సభ్యులకు ఇవ్వడానికి లక్ష్యంగా ఎంచుకోగా ఇప్పటి వరకు రూ. 6 కోట్లు రుణాలను మంజూరు చేశామన్నారు. డిసెంబరు నాటికి నూరుశాతం రుణాలను ఇచ్చేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో శావల్యాపురం మండలాన్ని పైలట్ ప్రాజెక్టు ఎంపిక చేసి మూడు క్లస్టర్లు పేటీయం మిషన్లు అందజేశామన్నారు. ఇక నుంచి స్త్రీనిధి రుణాలు చెల్లింపులు ఆర్థిక లావాదేవీల నిర్వహణ పేటీయం మిషన్లు, యూపీఐ, క్యూర్ కోడ్ ఆన్‌లైన్ విధానలో నగదు రహిత లావాదేవీలు పారదర్శకంగా జరగాలన్నారు. ఈ సమావేశంలో ఏపీయం జి.వాసుబాబు, మేనేజరు కిషోరు, సీసీలు ఖాజావలీ, బేబిరాణి, గొట్టం రమాదేవి, యానిమేటర్లు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొని మాట్లాడుతున్న ఏజీయం చినబుల్లెయ్య.

మండల స్థాయి స్కూల్ గేమ్స్ ప్రారంభం

శావల్యాపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో మండలస్థాయి స్కూలు గేమ్స్ బాల బాలికలకు అండర్–14, అండర్–17 ఎంపిక పోటీలు విభాగాలు జరిగినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఈఎంపిక పోటీలను మండల విద్యాశాఖాధికారిణి పుసులూరి లలితాకుమారి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తి ప్రతి ఒక్కరి పెంపొందించడానికి ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు.

మండలంలోని పోట్లూరు, వేల్పూరు, శావల్యాపురం, మతుకుమల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి 300 మంది బాల బాలికలు పాల్గొనగా, మొదటరోజు వాలీబాల్, కబడ్డీ, బాల్‌బ్యాడ్మింటిన్, త్రోబాల్, ఖోఖో, యోగ, టెన్నీస్‌కాయట్ ఎంపిక పోటీల్లో పాల్గొన్నట్లు చెప్పారు. చివరిరోజు శనివారం అథ్లెటిక్స్ పోటీలు మండలంలోని వేల్పూరు జెడ్పీ ఉన్నత పాఠశాల్లో జరుగుతాయని స్కూల్ గేమ్స్ కోఆర్డినేటరు రాగుల రాధాకృష్ణమూర్తి తెలిపారు. ఈకార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కాకుమాను రాజేష్,డి.మణి, ఉపాధ్యాయులు బెజవాడ నాగేశ్వరరావు, శ్రీనివాసరాజు, సుభాష్ చంద్రారెడ్డి, ఆదాంఖాన్ పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో లలితాకుమారి

రొంపిచర్లలో పోషకాహార మాసోత్సవం

రొంపిచర్ల: తక్కువ ఖర్చుతో ఆకు కూరలు, చిరుధాన్యాలతో ఎక్కువ పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తయారు చేసుకోవచ్చు అని జిల్లా అభివృద్ధి అధికారి మహాలక్ష్మి అన్నారు. మండల కేంద్రమైన రొంపిచర్లలో శుక్రవారం నిర్వహించిన పోషకాహార మాసోత్సవాల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ అరుణ, మాణిక్యరావు, పడాల చంద్రారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శశీదేవి, అంగన్‌వాడీలు, కార్యకర్తలు,గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

వినుకొండ(నూజెండ్ల): పోషణ మాసోత్సవంలో భాగంగా పట్టణంలోని ఏ సెక్టార్ పరిధిలోని 1 ఏరియాలో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్టార్ సూపర్‌వైజర్ డి.మరియకుమారి మాట్లాడుతూ చిరుధాన్యాలు, ఆకు కూరలు, పండ్లు, వైఎస్సార్ ఎస్పీ కిడ్స్, వైఎస్సార్ సంపూర్ణ పోషణ గురించి వివరించారు. రక్తహీనత రాకుండా ఆకుకూరలు, చిరుధాన్యాలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అభివృద్ధి అధికారి మహాలక్ష్మి

ప్రతి ఇంటి వద్దకు ఆరోగ్య సేవలు



నాదెండ్ల: రాష్ట్ర ప్రజలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని చిలకలూరిపేట నియోజకవర్గ ఎంఎల్‌వో రాము చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం నుంచి జగనన్న సురక్ష సర్వే ప్రారంభమైంది. సంకురాత్రిపాడు గ్రామంలో జరిగిన సర్వేలో వలంటీర్లకు సర్వే నిర్వహణపై అవగాహన కల్పించారు. అనంతరం వలంటీర్లు ప్రతి ఇంటినీ సందర్శించి ఆరోగ్యశ్రీ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. సచివాలయ, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి ప్రతివ్యక్తి ఆరోగ్య వివరాలు నమోదు చేసుకుని, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందించాలన్నారు. ఇందులో ఏడు రకాల వ్యాధులకు సంబంధించి వివరాలు నమోదు చేసుకుంటారని, వీరికి 105 రకాల మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అవసరమైన వారికి మెరుగైన వైద్యం కోసం శస్త్ర చికిత్సల కోసం వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఉచితంగా సేవలందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు జెట్టి బొల్లయ్య, వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్లలో రాగితీగల చోరీ

ఒక్కరోజే 30 చోట్ల పొలాల్లో చోరీ

నాదెండ్ల: మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలో కొంతకాలంగా వరుసగా జరుగుతున్న విద్యుత్ మోటర్లలోని విలువైన రాగితీగను దొంగిలిస్తూ రైతులను బెంబేలెత్తిస్తున్నారు. ఎండుగుంపాలెం వెళ్లే రోడ్డులో ఎక్కువ మంది రైతులు పొలాల్లోని బోర్లు ద్వారా విద్యుత్ మోటర్ల సాయంతో ఉద్యానవన పంటలు, కూరగాయల సాగు చేస్తుంటారు. ఈ గ్రామంలో గత కొంతకాలంగా నిత్యం ఏదో ఒక పొలంలో చోరీలు జరుగుతున్నాయి. గురువారం రాత్రి ఏకంగా 30 మందికి చెందిన రైతుల పొలాల్లో బోర్లలో ఉన్న విద్యుత్ మోటర్లను పైకి తీసి వైర్లను కట్ చేసి మోటర్లను తగలబెట్టి అందులోని విలువైన రాగితీగను దొంగిలిస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో నష్టపోయిన రైతులు మిరియాల చిన్నకోటయ్య, శివయ్య, లక్ష్మీనారాయణ, కమతం వెంకటేశ్వర్లు, హనుమంతరావు, కాండ్రు సుబ్బారావు, తదితరులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో కూడా పలుమార్లు ఇదేతరహాలో దొంగతనాలు జరిగాయని, ఒక్కో విద్యుత్ మోటరును తిరిగి పునరుద్ధరించాలంటే తమకు భారమౌతుందని ఆవేదన వ్యక్తం చేశారు. చోరీకి పాల్పడిన వారిని గుర్తించాలని కోరారు.

చికిత్స పొందుతూ కాటన్‌మిల్లు గుమస్తా మృతి

యడ్లపాడు: గడ్డిమందు సేవించి బలవన్మరణానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన యడ్లపాడు మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గుంటూరు జిల్లా పెదనందిపాడు గ్రామానికి చెందిన దండమూడి సత్యనారాయణ (42) కొద్దికాలంగా యడ్లపాడు మండలం తిమ్మాపురంలోని ఓ కాటన్‌మిల్లులో గుమస్తాగా విధులు నిర్వహిస్తున్నాడు. హఠాత్తుగా ఈనెల 14వ తేదీ మధ్యాహ్నం తిమ్మాపురం పరిధిలోని 16వ నంబర్ జాతీయ రహదారి పక్కనే ఉన్న ఎత్తిపోతల పథకం సమీపంలో గడ్డిమందు సేవించి పడి ఉండటాన్ని స్థానిక రైతులు గమనించారు. వెంటనే అతన్ని గుర్తుపట్టి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బంధుమిత్రులతో అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు సత్యనారాయణను 108 వాహనంలో చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రాథమిక చికిత్సలు చేయించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందాడు. దీంతో మృతుడు తండ్రి పూర్ణచంద్రరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తమకు కుమార్తె, కుమారుడు ఉన్నారని.. కుమార్తెకు వివాహం చేయగా, కుమారుడికి కాలేదని, చెడు వ్యసనాలకు బానిసైన కుమారుడు అనారోగ్యం పాలై ఆర్థిక పరిస్థితులు అనుకూలించక మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు వెల్లడించారు.

మాల మహానాడు ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ

రొంపిచర్ల: మండలంలో కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం మాల మహానాడు ఆధ్వర్యంలో హలో మాల ఛలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాలమహానాడు మండల నాయకులు పాల్గొని కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాలలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాల మహానాడు మండల నాయకులు ఉస్తేల చందు, ఉస్తేల కార్తీక్, దోమతోటి శివ, రమణ, మరియమ్మ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి

నియోజకవర్గ ఎన్నికల అధికారి కందుల శ్రీరాములు

శావల్యాపురం: ఎన్నికల కమిషనర్ ఆదేశాలు మేరకు 18 సంవత్సరాల నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి (ఈఆర్‌వో) కందుల శ్రీరాములు అన్నా రు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్‌వోలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్వో శ్రీరాములు మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామపంచాయతీలో 34 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఆయా పోలింగ్ కేంద్రాల పరిధిలో బీఎల్‌వోలు పిర్యాదులకు తావు లేకుండా పారదర్శకంగా తమ విధులు నిర్వహించాలన్నారు. నూతన ఓట్లు చేర్పులు, మార్పులు, తొలగింపులపై వచ్చిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా క్షేత్ర స్థాయిలో విచారణ చేసి పార్టీలకు అతీతంగా తగిన ఆధారాలు అందజేసిన అర్జీదారులకు సత్వరమే న్యాయం చేయాలన్నారు.

బీఎల్‌వోలకు క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఉన్నయడల అధికారుల దృష్టి తేవాలన్నారు. ఈసమావేశంలో డిప్యూటి తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, ఆర్‌ఐ పేరుసోముల నాసరయ్య, ఏఎస్‌వోలు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొని మాట్లాడుతున్న కందుల శ్రీరాములు

రైతన్న అభ్యున్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

ఎంపీపీ బత్తి రాములు

బొల్లాపల్లి : పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని రావులాపురం, గండిగనుమల గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న పాలవెల్లువలో మహిళా పాడి రైతులకు రుణమేళా గురించి శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బత్తి రాములు మాట్లాడుతూ జీడీసీసీ బ్యాంక్ ద్వారా మహిళా పాడిరైతులకు గేదెలు, ఆవులు కొనుగోలుకు రుణాలు అందజేయడంలో రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి అభివృద్ధికి ఎల్లవేళలా పాటుపడుతుందని అన్నారు. గతంలో పాడి పరిశ్రమ అభివృద్ధికి రుణ సౌకర్యం అంతంత మాత్రమేనని, ప్రస్తుత ప్రభుత్వం మహిళా పాడి రైతులకు జీడీసీసీ బ్యాంక్ ద్వారా ఈ పథకంలో రూ.లక్ష రుణ సౌకర్యం కల్పించి జగనన్న పాల వెల్లువ కేంద్రాలకు పాలు పోసి ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వం రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. నిర్ణీత కాలవ్యవధిలో రుణాలు తీసుకున్న వారు ఆర్థిక అభివృద్ధి సాధించి సకాలంలో రుణాలు చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో ఈపూరు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు పి.శ్రీనివాసమూర్తి, గుమ్మనంపాడు పశువైద్యాధికారి బి.సాల్మన్‌సింగ్, డీఆర్‌డీఏ సిబ్బంది, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.



జగనన్న పాల వెల్లువ అవగాహనలో మాట్లాడుతున్న ఎంపీపీ, ఇతర అధికారులు

జామియా మసీదులో ప్రత్యేక దువా

వినుకొండ(నూజెండ్ల): రాబోయే ఎన్నికలలో మరలా మన రాష్ట్రానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, వినుకొండ ఎమ్మెల్యేగా బొల్లా బ్రహ్మనాయుడు గెలుపొందాలని కోరుతూ పట్టణంలోని జామియా మసీదు (పెద్దమసీదు)లో శుక్రవారం జరిగిన నమాజ్ అనంతరం ముస్లిం మతపెద్దలు, పట్టణ ముస్లిం మైనార్టీ నాయకులు దువా చేయడం జరిగింది.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో పని చేసిన ఏ ఎమ్మెల్యే చేయని విధంగా ముస్లిం మైనార్టీలకు మేలు చేసిన ఏకైక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అని అన్నారు. వినుకొండలో ముస్లిం మైనార్టీ గురుకుల పాఠశాల, కాలేజీ, షాదీఖానా, ముస్లిం ఆస్తుల పరిరక్షణ, ముస్లింల కాలనీల్లో సీసీ రోడ్లు ఇలా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారన్నారు. ముస్లింలకు ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చి గౌరవించడం, నామినేటెడ్ పదవుల్లో, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల్లో ముస్లింలకు ప్రాధాన్యత ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు ముస్లింల పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు.



ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లిం పెద్దలు, మైనార్టీ నాయకులు

ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండల పరిషత్ కార్యాలయం వద్ద మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీవో వీరభద్రాచారి అధ్యక్షతన నిర్వహించి ఈ కార్యక్రమంలో పీడీ యుగంధర్, జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు జరిగిన 783 పనులకు గాను రూ.7.83కోట్ల ఖర్చుపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. డీఆర్‌పీలు జరిగిన పనులను ప్రజావేదికలో చదివి వినిపించారు. జరిగిన పనుల్లో లోపాలను గుర్తించి అవినీతికి పాల్పడిన వారిపై ఆర్‌ఆర్ చట్టం కింద రికవరీ చేస్తామని పీడీ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, జెడ్పీటీసీ జడ్డా సుబ్బులు రామయ్య, సొసైటీ అధ్యక్షులు పారా వెంకటేశ్వర్లు, ఏపీవో కట్టా నాగేశ్వరరావుతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.



ప్రజావేదికలో పాల్గొన్న పీడీ యుగంధర్